నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, బుధవారం 12 ఫిబ్రవరి 2025 SANGAREDDY



హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న అర్చకులు, నిర్వాహకులు

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- ఆ తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
- రైతు, ఇందిరమ్మ భరోసా 10 శాతం మందికి కూడా అందలేదు
- కోనాయిపల్లి నుంచే కేసీఆర్ తెలంగాణ ఉద్యమం ప్రారంభించారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, ఫిబ్రవరి 11 : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి కల్యాణంలో ఆయన పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌కు కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం అంటే ఎంతో ఇష్టమన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఈ ఆలయం నుంచే ప్రారంభించి రాష్ట్రాన్ని సాధించారన్నారు. కేసీఆర్ ఏ ముఖ్య కార్యక్రమాన్ని తీసుకున్నా ఈ దేవాలయం నుంచే ప్రారంభిస్తారన్నారు. రూ.3.6 కోట్లతో ఆలయాన్ని కేసీఆర్ అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి 15 నెలలుగా దేవాలయాలకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. కొత్తగా ఒక్క దేవాలయాన్ని అభివృద్ధి చేయకపోవడమే కాకుండా.. గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను కూడా నిలిపివేసినట్లు తెలిపారు. దేవుళ్ల మీద ఒట్టు పెట్టి పంద్రాగస్టు కల్లా పంట రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి మోసం చేశారన్నారు. మాట తప్పడం తప్పా నిలబెట్టుకోవడం రేవంత్‌రెడ్డికి చేతకాదన్నారు. జనవరి 26కి రైతుభరోసా, ఇందిరమ్మ భరోసా ఇస్తామని ఇప్పటి వరకు వేయలేదన్నారు. వానకాలం రైతుబంధు ఎగబెట్టి రూ.8 వేల కోట్లు రైతులకు అందకుండా చేశారన్నారు. మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడగొట్టారన్నారు. మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, ఆయిల్‌పామ్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, నాయకులు మల్లయ్య, భూపేశ్ పాల్గొన్నారు.



మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును ఆశీర్వదిస్తున్న అర్చకులు

# సాంకేతిక పరిజ్ఞానం చాలా ఉపయోగకరం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 11 : విద్యార్థుల కేరీర్‌లో సాంకేతిక పరిజ్ఞానం చాలా ఉపయోగకరంగా ఉంటుందని, అధ్యాపకుల మార్గదర్శకత్వంలో శ్రద్ధగా చదువుకోవాలని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి సూచించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, లైబ్రరీ వసతులను పరిశీలించి ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. కళాశాలలో మొత్తం 325 మంది విద్యార్థినులు చదువుతున్నారని వారికి తరగతి గదులు సరిపోవడం లేదని కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. విద్యార్థుల కోసం హాస్టల్, అసంపూర్తిగా ఉన్న ప్రహరీ నిర్మించాలని కలెక్టర్‌ను కోరారు. కళాశాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

# దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- ఆరు గ్యారెంటీలు అమలు చేసి స్థానిక ఎన్నికలకు వెళ్లాలి
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్




సంగారెడ్డి జిల్లా కందిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, ఫిబ్రవరి 11: దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగినవిధంగా గుణపాఠం చెప్పేందుకు సిద్ధమయ్యారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపించారు. కాంగ్రెస్ పాలనపై విసుగు చెందిన ప్రజలు రాళ్లవర్షం కురిపించడం ఖాయమన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కందిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కోసం రైతులు ఎదురు చూస్తున్నారని, పంటరుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదని విమర్శించారు. సన్నవడ్లకు ఇస్తామన్న బోనస్ సంగతేమైందని నిలదీశారు. ఆడబిడ్డ పెండ్లికి ఇస్తామన్న తులం బంగారానికి ఎగనామం పెట్టారని, ప్రజాపాలనలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని, మళ్లీ కేసీఆర్ పాలనే రావాలని కోరుకుంటున్నారని గుర్తుచేశారు. వందశాతం హామీలు అమలు చేసే దమ్ము, ధైర్యం కాంగ్రెస్‌కు లేదని స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. సీడీసీ మాజీ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ కృష్ణగౌడ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నరహరిరెడ్డి, బీఆర్‌ఎస్ కంది మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్, మనోహర్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, నందకిశోర్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

# కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

## మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



మెదక్ జిల్లా చల్మెడలో రేణుకాఎల్లమ్మను దర్శించుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

నిజాంపేట, ఫిబ్రవరి 11: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా 10 ఏండ్లు సుభిక్షమైన పాలన అందించిన మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా చల్మెడలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలను గౌడ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి ఆమె హాజరై అమ్మవారిని దర్శించుకొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పేరిట ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేశారని, మళ్లీ కేసీఆర్ సీఎం అయినప్పుడే రాష్ట్రానికి పూర్వవైభవం వస్తుందన్నారు. ఆలయానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేకు గౌడ సంఘం సభ్యులు శాలువాకప్పి సన్మానించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రామాయంపేట మున్సిపాల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ సంపత్, మాజీ ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, నాళం కృష్ణాగౌడ్, నాయకులు అబ్దుల్‌అజీజ్, గౌస్, నరేందర్, రంజిత్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, గౌడ సంఘం సభ్యులు ఎల్లాగౌడ్, లక్ష్మీనారాగౌడ్, తిర్మల్‌గౌడ్ పాల్గొన్నారు.

# మంచిపేరు తెచ్చుకోవాలి

## మహమ్మద్ ఫహాద్‌ను సన్మానించిన హరీశ్‌రావు



మహమ్మద్ ఫహాద్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

జహీరాబాద్, ఫిబ్రవరి 11 : పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సూచించారు. జహీరాబాద్ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నేత, ఉద్యమకారుడు మహమ్మద్ యాకూబ్ కుమారుడు మహమ్మద్ ఫహాద్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆర్థిక సహాయంతో బీడీఎస్ (బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జన్) పూర్తి చేసి ఉత్తీర్ణులయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం వారు హైదరాబాద్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే స్వగృహంలో హరీశ్‌రావును కలిశారు. మహమ్మద్ ఫహాద్ పొందిన బీడీఎస్ పట్టా సర్టిఫికెట్‌ను హరీశ్‌రావు నుంచి తీసుకున్నారు. తన కుమారుడి చదువుకోసం ఆర్థిక సహాయం చేసినందుకు మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు యాకూబ్ కృతజ్ఞతలు తెలియజేశారు. జహీరాబాద్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్, సీనియర్ బీఆర్‌ఎస్ నేత నామరవికిరణ్ పాల్గొన్నారు.

# గందరగోళంగా రైతు భరోసా





- కాంగ్రెస్ సర్కార్ అన్నీ కోతలు పెడుతున్నది
- రెండు ఎకరాల్లోపు వేశామంటున్న సర్కార్
- క్షేత్రస్థాయిలో ఏ రైతుకు పూర్తిగా పడడం లేదు
- ఇదేం సర్కార్ అంటూ మండిపడుతున్న రైతులు
- కేసీఆర్ సర్కార్ మంచిగా వేసింది అంటున్న కర్షకులు

సిద్దిపేట, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ సర్కార్ అన్నీ కోతలు పెడుతున్నది. ఎన్నికల ముందు అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలను మోసం చేస్తున్నది. ఏడాది గడుస్తున్నా ఇంత వరకు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఏ ఒక్కటి చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డిపై రైతులు మండిపడుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఠంచన్‌గా పంట సాగుకాలం ప్రారంభం కాగానే రైతు బంధు డబ్బులు జమ అయ్యేవి. ఇవ్వాళ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి అన్ని పథకాలకు కోత పెడుతున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాం లో సిద్ధం చేసిన రైతు బంధును మాత్రమే వేసింది. వానకాలంలో రైతులకు వేయాల్సిన రైతు భరోసాను ఎగ్గొట్టింది. యాసంగి సాగు పనులు పూర్తి అయినా ఇంత వరకు రైతు భరోసాకు దిక్కులేదు. గత నెల 26 నుంచి రైతు భరోసా కింద ఎకరానికి 6 వేల చొప్పున వేస్తామని చెప్పింది. ఎన్నికల్లో రెండు పంటలకు కలిపి ఎకరం రూ. 15 వేల చొప్పున అని చెప్పి దాన్ని తగ్గించి రూ. 12 వేలకు చేసింది. అయినా సరే అది అన్న వేస్తారా అంటే అది కూడా సరిగ్గా వేయడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో ఒక్క గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకొని తొలి విడతలో ఎకరానికి రూ. 6 వేలచొప్పున గ్రామంలోని రైతులకు వేశారు. నాలుగు రోజుల కింద ఎకరం వరకు, రెండు రోజుల కింద రెండు ఎకరాల వరకు మూడు విడతల్లో రైతు భరోసా విడుదల చేశామని ప్రభుత్వం గొప్పలు చెప్పింది. కానీ ఏ రైతుకు పూర్తి స్థాయిలో రైతు భరోసా పడడం లేదు.

### కోతల భరోసా

రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయడంలో అంతా గందరగోళంగా మారింది. ఏ రైతుకు ఎంత భూమి ఉంటే అన్ని డబ్బులు లెక్క ప్రకారం పడాలి. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అలా పడడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఎకరాకు రెండు పంటలకు కలిపి రూ. 10 వేలు జమ చేశారు. పంట సాగుకు ముందే డబ్బులు రైతుల ఖాతాలో ఒక సిస్టమేటిక్‌గా వేశారు. తొలుత ఎకరం, తర్వాత రెండు ఎకరాలు...ఇలా స్లాబ్‌ల విధానంలో వారం పది రోజుల్లో రైతులందరికీ పూర్తి స్థాయిలో డబ్బులు పడేవి. అప్పుడు రైతులు ఖుషీగా ఉన్నారు. కేసీఆర్ సర్కార్ మంచిగా ఉండే అని రైతులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని కోతలు ఉన్నాయి. ఒక స్పష్టమైన విధానం అంటూ ప్రభుత్వానికి లేకుండా పోయింది. యాసంగి సాగుకు సంబంధించిన రైతు భరోసా వేస్తున్నామని చెబుతున్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో వేశామంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది. ఒక ఎకరం వరకు ఉన్న రైతులకు ఇంత వరకు దిక్కులేదు. మెజార్టీ మంది రైతులకు రైతు భరోసా పడలేదు.ఒక వేళ పడినా ఆ రైతుకు కోతలు పెట్టి రైతు భరోసాను వేసింది. రెండు సర్వే నంబర్లు ఉంటే దానిలో ఓ సర్వే నెంబర్ కోత పెట్టడం, గుంటల్లో లెక్కలు తప్పులే చేసి వేయడం ఇలా అన్ని కోతలు పెడుతుంది. కనీసం ఇచ్చే డబ్బులు కూడా వేయడం లేదని రైతులు ప్రభుత్వంపై మండి పడుతున్నారు. మొన్న రెండు ఎకరాల్లోపు వేశామని చెప్పింది. రెండు ఎకరాల్లోపు రైతులు తమకు పడ్డాయే ఏమే అని బ్యాంకుకు వెళ్లి చూస్తే సగం సగం డబ్బులు పడ్డాయని రైతులు వాపోతున్నారు. ఇదేం కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన మాట ఏంది వేస్తున్న డబ్బులు ఏంటి అని రైతులు ప్రభుత్వంపై మండి పడుతున్నారు.



An amount of INR 5,325.00 has been credited to XXXXX03102 on 10/02/2025 towards NEFT by Sender PAY AND ACCOUNTS OFFICE (MAIN, IFSC RBIS0GOTGEP, Sender A/c XXXX1038, RESERVE BANK OF INDIA, PAD, RB, UTR RBI0422523770902, Total Avail. Bal INR 5830.55- Canara Bank

రైతు కరుణాకర్ సెల్‌కు వచ్చిన రైతు భరోసా డబ్బుల టెక్ట్స్ మెసేజ్



నంగునూరు మండలం బద్దిపడగ గ్రామానికి చెందిన ముక్కెర కరుణాకర్‌కు ఎకరం ఎనిమిది గుంటల వ్యవసాయ భూమి ఉండగా సాగు చేసుకుంటున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం రెండు ఎకరాల్లోపు సోమవారం రైతు భరోసా విడుదల చేసింది. ఈ రైతుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరం రూ. 6వేల చొప్పన రూ.7,312 రావాలి. కానీ రూ. 5,325 మాత్రమే పడ్డాయి. రూ. 1,987 తక్కువ వచ్చాయి. ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు రైతులకు పడుతున్న భరోసా డబ్బులకు పొంతన లేకుండా పోయింది.



దుబ్బాక మండలం పెద్దగుండవెల్లికి చెందిన యాడవరం రమేశ్‌కు రెండు సర్వే నంబర్లలో వేర్వేరుగా 0-28 గుంటల భూమి ఉంది. కానీ కేవలం ఒక్క సర్వే నెంబర్‌లోని 14 గుంటల భూమికి మాత్రమే రూ 2,100 ప్రభుత్వం రైతు భరోసా జమచేసింది.మిగతా 0-14 గుంటల భూమికి సంబంధించిన డబ్బులు జమ కాలేదు. వేసే రైతు భరోసా డబ్బులు కూడా సరిగ్గా రావడం లేదు. ఇప్పటికే వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టింది. ఇప్పుడు అరకొర వేస్తున్నారని రైతు తన ఆవేదన వ్యక్తం చేశారు. సగం భూమికి డబ్బులు ఇవ్వడం ఏమిటో అర్థం కావడం లేదు.

నంగునూరు మండలం అక్కెనపల్లికి చెందిన సురేశ్ అనే రైతుకు 0-21 గుంటల భూమి ఉంది. రైతు భరోసా కింద రూ. 2,625 పడ్డాయి. ఇది ఏలెక్కన వేశారో అర్థం కాని పరిస్థితి. రైతు భరోసా కింద రూ. 6వేలు ఎకరానికి వేస్తున్నారు. ఈ రైతుకు 21 గుంటలకు రూ.3,150 జమ కావాలి. రూ 525 తక్కువ పడ్డాయి. ఇది ఏలెక్కన వేశారు అని వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే మాకేం తెలియదు అని సమాధానం. ఇదేం ప్రభుత్వం ఇదేం భరోసా అంటూ ప్రభుత్వంపై రైతు మండిపడుతున్నాడు.




డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో పాడిపశువులతో ఎన్‌హెచ్‌పై వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న రైతు జేఏసీ నాయకులు

# వినూత్న నిరసన

- డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా పాడిపశువులతో ఎన్‌హెచ్‌పై ఆందోళన



సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో ప్రారంభించిన రిలే నిరాహారదీక్ష



గుమ్మడిదల,ఫిబ్రవరి11: పచ్చని అడవిని చెత్తకంపుతో పాడుచేస్తానంటే ఊరుకునేది లేదని గుమ్మడిదల రైతు జేఏసీ నాయకులు ధ్వజమెత్తారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో రైతు జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అఖిలపక్షనాయకులు, అన్ని కుల, మహిళా, రైతు సంఘాల నాయకులు, పలు గ్రామాల ప్రజలు సంయుక్తంగా మంగళవారం జాతీయ రహదారి 765డీపై పాడిరైతులు,బర్రెలు, ఆవులు, దున్నపోతులతో నిరసన వ్యక్తం చేశారు. దున్నపోతులపై డంపింగ్‌యార్డు మాకొద్దు.. మాకడుపులు కొట్టొద్దు అంటూ వినూత్నంగా రాశారు. కొత్తపల్లి, నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో ఏడో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. కొత్తపల్లిలో వాటర్ ట్యాంక్ ఎక్కి వినూత్నంగా యువకులు ఆందోళన చేశారు. మున్సిపాలిటీ కేంద్రంలో రైతు జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షను ప్రారంభించారు. రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, ఆలయకమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఫయాజ్ షరీఫ్, హుస్సేన్, మాజీ సర్పంచ్‌లు శంకర్, ఆంజనేయులు,తులసీదాసు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు రిలే నిరాహారదీక్షలో పాల్గొని నినాదాలు చేశారు. అడవులు, రైతులు, గాలి, నీటిని రక్షించాలని జనచైతన్య కళాకారుడు ఎల్లయ్య జానపదగేయాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈసందర్భంగా జేఏసీ కమిటీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ డంపింగ్‌యార్డు పనులను వెంటనే నిలిపి వేసి అనుమతులను రద్దు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# నీళ్లందక ఎండుతున్న పొలాలు



సిద్దిపేట జిల్లా కేశవాపూర్‌లో ఎండిపోయిన మక్క చేనులో ఎడ్లను మేపుతున్న రైతు కిష్టయ్య

అక్కన్నపేట, ఫిబ్రవరి 11 : సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల వ్యాప్తంగా సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికందే సమయంలో నీళ్లందక కండ్ల ముందే ఎండిపోతున్నాయి. అక్కన్నపేట మండలంలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన గోనె కిష్టయ్య అనే రైతు రెండు ఎకరాల్లో మక్క, మరో రెండు ఎకరాల్లో వరి సాగుచేశాడు. యాసంగిలో నీటి ఎద్దడి ఉంటుందని ముందుగానే గ్రహించి వరినాట్లు వేశాడు. తరువాత మక్క సాగు చేశాడు. అయినప్పటికీ నీళ్లందక వరి వరుస తళ్లతో పారిస్తుండగా, మక్కచేను ఎండిపోతున్నది. పెట్టుబడి పెట్టి సాగుచేసిన మక్క కండ్ల ముందే ఎండిపోతుండడంతో పశువులను మేపుతున్నాడు. మళ్ల రైతులకు నీళ్ల కష్టాలు మొదలయ్యాయని రైతు కిష్టయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.గతేడాదితో పోల్చితే ఈ యేడు ముందుగా భూగర్భజలాలు తగ్గిపోయి నీటి కొరత ఏర్పడింది. ఇప్పటికే కొన్ని చోట్ల బోర్లు, బావుల్లో నీళ్లు అడుగంటుతున్నాయి.

# ముగిసిన పాత పంటల జాతర




సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్, సైంటిస్టు డాక్టర్ సోమమర్ల

ఝరాసంగం, ఫిబ్రవరి 11 : పట్టణాల్లో ఆరోగ్యకరమైన తిండి తింటున్నాం అంటే మీలాంటి రైతుల వల్లనే అని రిటైర్డ్ ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ సోమమర్ల అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని మాచనూర్ గ్రామశివారులో పచ్చసాలే ఆవరణలో డక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 25వ పాత పంటల జాతర ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి కాలం వ్యవసాయం ప్రకృతికి విరుద్ధంగా జరుగుతుందని, రసాయన ఎరువుల వాడకం వల్ల భూమిలోని సారం రోజురోజుకు క్షీణిస్తుందన్నారు. అనంతరం డిసెంబర్-2024లో డీడీఎస్ వారు స్కూల్ పిల్లలకు నిర్వహించిన జీవవైవిధ్య పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి జహీరాబాద్‌లోని సిద్ధార్థ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు, రెండో బహుమతి న్యాల్‌కల్ మండలం జడ్పీహెచ్‌ఎస్ మీర్జాపూర్ విద్యార్థులు, మూడో బహుమతి ఝరాసంగం మోడల్ స్కూల్ విద్యార్థులు గెలుచుకున్నారు. జాతర నిర్వాహకులు మంజుల, వినయ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్‌బాబు, డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య వెలుగూరి , డీడీఎస్ మాణిక్యం, మాజీ శాసన మండలి చైర్మన్ రాములునాయక్, ఏడీఏ భిక్షపతి, వ్యవసాయాధికారి హరి వెంకట ప్రసాద్, ఎప్పై నరేశ్, డీడీఎం, నాబార్డ్ కృష్ణ తేజ, వ్యవసాయ కమిషన్ మెంబర్ గంగాధర్, అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్, డీడీఎస్ మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు

# నెల రోజులుగా అంధకారం

- హుస్నాబాద్‌లో ప్రధాన రహదారిపై చీకట్లు
- పట్టించుకోని అధికారులు
- చోటుచేసుకుంటున్న ప్రమాదాలు

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 11: హుస్నాబాద్ పట్టణంలో ప్రధాన రహదారిపై నెలరోజులుగా విద్యుత్‌దీపాలు వెలగడంలేదు. చిమ్మచీకట్లోనే పాదచారులు, వాహనదారులు వెళ్లాల్సిన దుస్థితి. ఇది నియోజకవర్గ కేంద్రమైన హుస్నాబాద్ పట్టణంలోని పరిస్థితి. జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా సెంట్రల్ లైటింగ్ సిస్టం పనిచేయకపోవడంతో హుస్నాబాద్ పట్టణంలోని సిద్దిపేట, హన్మకొండ రోడ్డును కలిపే ప్రధాన రహదారిపై చీకట్లు అలుముకున్నాయి. దీంతో రాత్రంతా చీకట్లనే ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డుమధ్యలోనే డివైడర్ల నడుమ ఏర్పాటుచేసిన సీతాకోకచిలుక విద్యుత్‌దీపాలు ఆరిపోయి నెలరోజులు గడుస్తున్నా వాటిని పునరుద్ధరించే విషయం ఎవరికీ పట్టడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు. జాతీయ రహదారి పునరద్ధరణలో భాగంగా సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌కు సంబంధించి విద్యుత్‌వైర్లను సదరు కాంట్రాక్టర్ తొలిగించారు. దీంతో చిమ్మచీకట్లు అలుముకుని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఈ పరిస్థితి నెలకొనడంతో వాహనాలు మధ్యలోని డివైడర్లను ఢీకొని అనేకమంది గాయాల పాలవుతున్నారు. వచ్చివెళ్లే వాహనాలకు చీకట్లు ఉండటంతో ప్రమాదాల బారిన పడుతున్నాయనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ దీపాలు పునరుద్ధరించే విషయంలో మున్సిపాలిటీ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకుని విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



హుస్నాబాద్ పట్టణం ప్రధాన రహదారిపై వెలగని విద్యుత్ దీపాలు